# బాపూ బొమ్మ - 4

పెళ్ళి నిశ్చయమయ్యాక... మనసులో ఒక వేపు మధురోహల సడీ, మరోవేపు ఏదో తెలియని అలజడీ..!

ఇక ఇంట్లో అయితే చెప్పనే అక్కర్లేదు.. సందడే సందడి!

పసుపు దంచటంతో పెళ్ళి పనులకు శ్రీకారం చుట్టారు! ముందుగా అత్తయ్యలు ముగ్గురూ వచ్చేసారు. ఆ తరువాత ఒక్కొక్కరుగా దగ్గిర బంధువులు చుట్టుపక్కల వూళ్ల నుండి రావటం మొదలైంది.

ఇంటిముందు పెద్ద పందిరి తాటాకులది వెలిసింది! కొబ్బరాకులు చుట్టిన స్తంభాల చుట్టూ వీధిలోని చిన్న పిల్లలంతా ఒకటే ఆటలు! అరుగుల మీద లంగా ఓణీల అమ్మాయిల అష్టాచెమ్మాలాంటి ఆటలు! ఇంకొంచెం పెద్దపిల్లలు ఇల్లంతా కలియతిరుగుతూనో, ఒకచోట కూర్చునో ఒకటే ముచ్చట్లు!

ఇక పెరట్లో తవ్విన గాడి పొయ్యిల చుట్టూ చేరిన ఆడవాళ్ళు వంటలు చేస్తున్నవాళ్లకి కావలసినవి అందిస్తూనో, తరిగి ఇస్తూనో పరిహాసాలూ, పరాచికాలూ! మొత్తానికి ఇల్లంతా నవ్వులు, కబుర్లతో ఏదో హడావుడీ! దీన్నే పెళ్ళిసందడి అంటారన్నమాట. అరిసెలు, లడ్డూ, కారం బూందీల్లాంటి పిండి వంటలు చేసి డబ్బాల్లో నింపుతున్నారు. ఆ ఘుమ ఘుమలకి వాకిట్లో ఆడుకుంటున్న పిల్లల గుంపు వచ్చి చేయిచాపటం, పెద్దలు.. ''పెళ్ళినాటికి ఏమీ మిగిల్చేలా లేరే' అంటూ మురిపెంగా విసుక్కుంటూనే వాళ్ళ చేతుల్లో ఏదో ఒకటి పెట్టటం.. వీధిలోకి వచ్చేలోపే చేతుల్లోని మిఠాయిని స్వాహా చేసేసిన పిల్లలు, మళ్ళీ వెంటనే వెళ్తే చివాట్లు తప్పవేమోనన్నట్లుగా కాసేపు ఆటలు ఆడుతూ తటపటాయించి... అపుడు మళ్ళీ వెళ్ళి చేయిచాపటం..! నాకేమో అదంతా చూస్తుంటే చాలా సరదాగా, నవ్వుగా అనిపించేది!

మా ఊళ్ళో అరిసెల పాకం పట్టటానికి శేషమ్మ పెద్దమ్మకి బాగా పేరు. ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా పిండివంటల తయారీకి ఆవిడ హాజరు తప్పనిసరి! పొయ్యి పక్కనే ఎత్తుపీటమీద కూర్చున్న శేషు పెద్దమ్మకి దగ్గరగా చిన్నపీట మీద ఆశీనురాలైన పెద్దత్త పెరట్లోకి వెళ్ళిన నన్ను చూసి ''బుల్లెమ్మాయి.. ఈ పిండివంటలూ, అవీ ఎలా చేస్తున్నారో చూసి కాస్త నేర్చుకోకూడదటే... మీ అత్తగారు ఏదైనా చెయ్యమని పురమాయిస్తే ఇబ్బంది పడకుండా ఉంటావూ...!'' అంది.

అరుగుమీద కూర్చుని చేటతో ఏవో పప్పుల్ని బాగు చేస్తున్న చిన్నత్త వెంటనే జవాబు చెప్పేసింది. ''బావుందే అక్కయ్యా నువ్వు చెప్పేది... బుల్లెమ్మాయి అత్తింటి వాళ్ళు ఆ వూరుకంతటికీ భాగ్యవంతులట! ఆ అత్తగారు కోరి కోడలుగా చేసుకుంటోంది మన అమ్మాయిని! ఇలాంటి వంటలూ అవీ చేయిస్తుందా ఏమిటీ... వంటవాళ్ళు చేసి పెడితే తినటమే మనమ్మాయి చేయగల్గిన గొప్పపని! దీనికి అది కూడా చేతకాదనుకో...'' అంటూ నవ్వింది.

''అవును... నిజమే...' అంటూ ఆఖరి అత్త అందుకుంది. ''బుల్లెమ్మాయి ఇక్కడే ఏ పనీ చేయదు. 'పెళ్ళయ్యాక అందరికీ వండి వడ్డించాలిగా, పిల్లకి పని నేర్పవేమిటమ్మా' అని వదినను అడిగితే 'ఎప్పుడూ ఏదో పుస్తకం పట్టుకుని కూర్చునే పిల్లని పిలిచి పని పురమాయించబుద్ధి కాదమ్మా... ఏదో చదువుకుంటోందిగా,

పనులది ఏముందిలే... అవసరాన్ని బట్టి అవే అలవాటవుతాయి...' అని జవాబు చెప్పింది. నిజమేగా...''

''ఏమిటో.. కల్యాణం ఇలా తోసుకు వచ్చేసింది. లేకపోతే ఏ కలెక్టరమ్మ అవుతుందో అనుకునే దాన్ని...'' అంటూ పెద్దత్త నిట్టూర్చింది.

''నేను మాత్రం... డాక్టరయ్యా, మన వూరిలో హాస్పిటల్ పెడితే ఎంత బావుంటుందో... అనుకునేదానిని... ప్చ్.. ఇపుడు మనందరిలాగే.. పిల్లలూ ఆ ఝంఝాటమూ..'' అంది చిన్నత్త.

'' అదేమిటమ్మాయ్... అలా అంటున్నావ్...? డాక్టరమ్మ అయితే మాత్రం పెళ్ళి చేసుకోరా... పిల్లల్ని కనరా..? పిల్లల్ని బాదరబందీ అనుకుంటే ఎలా... ఏ ముచ్చటకి ఆ ముచ్చటే.. అన్నీ జరగాలి...!'' అని ఇంకొక ఆమె చిన్నత్తకి జవాబు చెప్పింది.

అప్పుడు నేను నోరు విప్పాను. ''అత్తా... నేను పెళ్ళయ్యాక కూడా కాలేజికి వెళ్ళి చదువుకుంటాను.''

''నిజమా..? అదెలా కుదురుతుందే..?'' చిన్నత్త బుగ్గల్ని పట్టుకుని ఆశ్చర్యపోయింది.

''ఆ మాట మా అత్తగారే చెప్పిందత్తా..'' చిరునవ్వుతో అన్నాను. అప్పుడే లోపలిగదిలో కనిపించిన నాన్నని పిలిచాను. ''నాన్నా.. వాళ్ళు... నేను కాలేజికి వెళ్ళి చదువుకోవచ్చని చెప్పారు కదూ... చిన్నత్త అదెలా కుదురుతుందని ఆశ్చర్యపోతుందేమిటీ?'' అనడిగా.

పెరట్లోకి వచ్చిన నాన్న బుల్లత్త పక్కన అరుగుమీద కూర్చుని చేటలోని పెసల్ని రెండు నోట్లో వేసుకుని నములుతూ అన్నారు'' నిజమేనమ్మా... బుల్లెమ్మాయికి ఇపుడే పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదూ, చదువుకుంటానని అంటోంది అని అదే.. అమ్మాయి కాబోయే అత్తగారితో చెబితే 'దానిదేం ఉందండీ... కోడలు చదువుకుంటానంటే మాకేం ఇబ్బందీ... ఇక్కడనుండి బదులుగా మా ఊరునుండి పట్నం వెళ్ళి చదువుకుంటుందీ' అని చెప్పిందమ్మా ఆవిడ..''

''అన్నయ్యా... బుల్లెమ్మాయి పెళ్ళి చూపులకి మమ్మల్ని పిలవనే లేదు. పైగా ఆ రోజే తాంబూలాలూ పుచ్చేసుకుని లగ్నాలూ పెట్టేసుకున్నారు...'' పెద్దత్త కొంచెం నిష్ఠూరంగానే అంది.

'' ఏం చేయమంటావమ్మా... అన్నయ్యకి ఎవరో ఈ సంబంధం గురించి చెప్పి సాయంకాలం మనింటికి వస్తారటా అని కబురు చెప్పారు. వాళ్ళ ఆస్తిపాస్తుల వివరాలూ అవీ అన్నీ తెలియజెప్పేసరికి ఇది కుదిరే సంబంధం కాదులే అన్న నమ్మకంతో ఉన్నాన్నేను. అన్నయ్య మాట కాదనలేక వాళ్ళు రావటానికి సరే అని తలవూపానంతే ..అందుకే మీకెవ్వరికీ తెలియపర్చాల్సిన అవసరమూ లేదనుకున్నా. అంత వ్యవధి కూడా లేకపోయింది! నేనేం అభ్యంతరం చెప్పినా ఆవిడ తేలిగ్గా తోసిపారేసింది! నాకే ఆశ్చర్యంగా అనిపించిందనుకో. నేనావిడకు మన పరిస్థితి ఏమి దాచకుండా చెప్పేసాను. 'మాకున్నది ఒక్కతే అమ్మాయి గనుక మాకున్నది తృణమో, పణమో కూడా అంతా అమ్మాయికే చెందుతుందనుకోండి. ఏదో మా తాహతుకు తగ్గట్టుగా ఇవ్వాలన్నా ఇప్పటికిప్పుడు కొంచెం కష్టమే అవుతుంది! పెళ్ళి ఆలోచనే ప్రస్తుతానికి పెట్టుకోలేదు కనుక పెళ్ళిఖర్చులకే కాలూ చెయ్యి కూడదీసుకోవటం కష్టమౌతుందనిపిస్తోంది' అన్నాను.

దానికి ఆవిడ ఎంత పెద్ద మనసుతో సమాధానం చెప్పిందనుకున్నావ్! ‘మేం అన్నీ తెలుసుకునే వచ్చాం. కట్నకానుకల ఆశ ఉంటే ఇక్కడివరకూ రానవసరం లేదు. అమ్మాయే ముఖ్యమనుకున్నాం. అందుకే బెట్టు లేకుండా మేమే పిల్లని అడగటానికి వచ్చాం. పచ్చని పందిర్లో.. పదిమంది పెద్దల మధ్యా మీ అమ్మాయిని మాకప్పగించండి.. చాలు.. పెళ్ళి ఆర్భాటంగా చేయాలని కూడా అడగం. కట్నమూ వద్దు లాంఛనాలూ అంతే. మీరేం హైరానా పడకండి. మాకూ, మీకూ ఒక్కొక్కరే అని పెద్దఎత్తున పెళ్ళి చేయాలనే చాదస్తం పెట్టుకోకండి. తీరుబడిగా తర్వాతి శుభకార్యాలు సీమంతం, బాలసారె లాంటివన్నీ బాగా జరిపిద్దాం... అన్నయ్యగారూ.. సరేనా..’అందావిడ. ఆ మాటలకు నాకు నిజంగా మనసు నిండిపోయిందనుకో ! ఆస్తిపాస్తులదేం గానీ, అంత మంచిమనసు ఉన్న అత్తగారు మన బుల్లెమ్మాయికి దొరకటం అదృష్టమే...!’’

నాన్న మాటలకు అత్తయ్య చిరునవ్వు నవ్వింది. ‘‘ఆ మాట ముమ్మాటికీ నిజం! బుల్లెమ్మాయికి దగ్గరివాళ్ళలో వరసయ్యే సంబంధాలు లేవు.. మంచి సంబంధం కోసం ప్రయాసపడి తిరగాల్సిన అవసరం లేకుండా సునాయాసంగా సంబంధం కుదిరిపోయింది. “

చిన్నత్త కూడా సమర్థించింది.‘‘అవును అన్నయ్యా, మంచి నిర్ణయమే నీది. బుల్లెమ్మాయి ఇష్టప్రకారం చదివిస్తే పెళ్ళికి అంతకన్నా ఎక్కువ చదివిన వరుడిని వెతకాల్సి వచ్చేది! ఇపుడు పెళ్ళయ్యాక చదువుకుంటుంది కాబట్టి సమస్య లేదు!’’

బుల్లి అత్తయ్య నిట్టూర్చి అంది. ‘‘కలెక్టరో, డాక్టరో కాలేకపోతేనేంలే, ఐశ్వర్యవంతుల ఇంటి కోడలు అవుతోంది! కోరి చేసుకుంటున్నారు కాబట్టి... గారంగానూ చూసుకుంటారు! సతాయింపులేం ఉండవు!’’

నేను నాన్న పక్కనే కూర్చుని నాన్న భుజం మీద తలవాల్చి అత్తయ్య వేపు చూస్తూ చిరునవ్వుతో అన్నాను. ‘‘అత్తా.. నేను బాగా చదువుకుని కలెక్టరో, డాక్టరో కావాలని అనుకోలేదెప్పుడూ! నాకు టీచరుగా ఉద్యోగం చేయటమే చాలా ఇష్టం...!’’

‘‘అదేమిటే.. అంత మాట అన్నావ్? బాగా చదువుతావని, తెలివైనదానివని అందరూ అంటారుగా, నువ్వేమిటీ పంతులమ్మనవుతానంటున్నావ్..?’’ అత్త ఆశ్చర్యపోయింది.

‘‘ఎంతోమంది డాక్టర్లు, కలెక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు... వాళ్ళందరికీ గురువు అయ్యే అదృష్టం, అవకాశం ఉంటుందిగా! బాధ్యతగా పాఠం చెప్పటమే కాదు. నైతిక విలువలు బోధించే మాష్టర్లు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నట్లే! రేపటి పౌరులుగా సమాజంలో అడుగుపెట్టే విద్యార్థులను తీర్చిదిద్దే సువర్ణావకాశం టీచర్లకే దక్కుతుంది! పిల్లలతో స్నేహంగా మెలగుతూనే క్రమశిక్షణనూ, మంచి సూక్తుల్నీ పాఠాలతో పాటు బోధించే గురువుల పట్ల పిల్లలకు ఎంత ఇష్టం, ఆరాధనా ఉంటుందో నాకు తెలుసు...!’’

ఎంతో ఉత్సాహంగా నేను చెప్పిన ఆ మాటల్ని అత్తయ్యలు తేలిగ్గా తీసిపారెయ్యకుండా ‘‘అవునా... బావుందే...’’ అంటూ మెచ్చుకుంటున్నట్లుగా నావేపు చూడటం నేను మర్చిపోలేని జ్ఞాపకం!

ఇంతలో బుజ్జి వచ్చి ‘‘సుందరీ వాళ్ళంతా నిన్ను రమ్మని పిలుస్తున్నారు.’’ అంటూ నా చెవిలో గుసగుసలాడాడు.

‘ఏమై ఉంటుందబ్బా...’ అనుకుంటూనే వెంటనే లేచి వెళ్ళాను.

ఏమైనా చిరుతిండి కావాలేమోనని నన్ను పిలుస్తున్నారనుకున్నాను.

అప్పుడే పెట్టించుకుని వెళ్ళి, మళ్ళీ వెంటనే వస్తే పెద్దవాళ్ళు కసురుతారేమోననే వెరపుతో నన్ను అడగుతారనుకున్నా. కానీ నా అంచనా తప్పయింది.

సుందరి మా బంధువులమ్మాయే. తన చుట్టూ నలుగురైదుగురు ఉన్నారు. వాళ్ళు నిశ్శబ్దం అన్నట్లుగా పెదవులపై వేలు పెట్టుకుని సైగ చేసి నన్ను మా పక్కనే ఉండే పెదనాన్న ఇంటికి లాక్కెళ్ళారు.

కొంచెంగా తలుపులు చేరవేసి ఉన్న సామాన్లగది దగ్గరకు నన్ను లాక్కెళ్ళి ఆ తలుపు సందులో నుండి చూడమని సైగలతోనే చెప్పారు.

ఆ గుంపును అటూ ఇటూ తోసి నేను నిశ్శబ్ధంగానే లోపలకు చూశాను.

ఒక బస్తాకి చేరగిలబడి నేలమీద కూర్చుని కాళ్ళు బారచాపుకున్న పెదనాన్న గారి అమ్మాయి శకుంతల ఏదో కాగితం చదువుకుంటోంది.

నేను పక్కకి జరిగి సుందరితో “ఏదో పద్దుల కాగితం సరిచూసుకుంటోందేమో...! ఆ మాత్రం దానికి.. మీరంతా ఏమిటీ హడావుడీ?’’ చాలా మెల్లగానే అన్నాను.

నన్ను కొంచెం పక్కకు లాక్కువెళ్ళి సుందరి ఫక్కున నవ్వింది. పద్దుల కాగితం సరిచూస్తుంటుంటే.. మొహంలో పటం కట్టినట్లుగా అంత ముద్దూ మురిపెం కనిపిస్తుందా... భలేగా మాట్లాడుతున్నావే!’’ అంటూ మళ్లీ నవ్వి “ఇపుడు గమనించి చూడు...నీకే తెలుస్తుంది.’’ అంటూ నన్ను ముందుకు తోసింది.

వాళ్ళంతా చప్పుడు చేయకుండానే పకపకలాడారు.

నేను మెల్లగా అడుగులో అడుగు వేస్తూ మళ్ళీ తలుపు సందులో నుండి చూశా.

నిజమే... సుందరి చెప్పిన మాట! శకుంతల పెదవులపై ముసిముసి నవ్వు! తన మొహం చూస్తుంటే... కథల్లో చదివిన ‘రాగరంజితం’ అనే మాటకి అర్థం తెలిసింది.

నాకంటే చిన్నదైన సుందరి ఇంత తెలివైందా? ఆశ్చర్యపోయాను. వెనక్కి వచ్చి ఆ గుంపుతో కలిసి కొంచెం దూరం బయటకు వచ్చాను.

‘‘అవునూ... శకుంతల అక్క అంత ఇష్టంగా చదువుకుంటున్న ఆ కాగితంలో ఏముందో...’’ అన్నాను.

‘‘ఇందాకనే పోస్ట్‌మాన్ వచ్చి అక్కకు ఓ కవరు ఇచ్చి వెళ్లాడు. కాసేపు ఆ కవరు చేత పట్టుకుని అటూ ఇటూ తిరిగి చివరకు ఆ సామాన్ల గదిలోకి వెళ్లటం చూశాను..!’’ ఒక పిల్ల ఒకింత గర్వంగా అంది.

‘‘ఏదో కాసేపటికి బయటకు వస్తుందేమో అనుకున్నాం. అబ్బే... గంట సేపటి నుండీ అక్కడే తిష్ట వేసుక్కూర్చుని చదువుకుంటోంది’’ ఇంకేం పట్టించుకోవటంలేదు! సుందరి మళ్ళీ పెద్దగా నవ్వింది.

శకుంతల అక్కకి ఆరు నెలల కిందట పెళ్ళయింది. దూరపు సంబంధం. వాళ్ళు ఉండేది కూడా ఎక్కడో దూరంగానే. ఆ బావ, అమ్మా నాన్నలు కూడా వీళ్ళతోనే బావ ఉద్యోగం చేసే ఊళ్ళోనే ఉంటారు.

శకుంతల అక్కని రాత్రంతా ప్రయాణం చేయాలనే కారణంతో పెళ్ళయ్యాక ఒక్కసారే పంపించారు. బావ కూడా వచ్చి మరుసటి రోజే తనకు సెలవు లేదంటూ అక్కని కూడా తీసుకెళ్లిపోయాడు.

అక్క అత్తగారు గయ్యాళిరకం అని చెప్పుకోవటం నేనూ విన్నాను. ఇప్పుడు ఎలాగో పెళ్ళికని ముందుగానే పంపించారని పెద్దమ్మ వాళ్ళంతా సంబరపడ్డారు. అక్క వచ్చి నాలుగు రోజులయిందో లేదో అపుడే బావ ఉత్తరం రాసాడన్నమాట! పాపం... అక్క అంత ఇష్టంగా ఆ ఉత్తరాన్ని రహస్యంగా అక్కడ చదువుకుంటుంటే ఈ పిల్లల గుంపు అది కనిపెట్టి నవ్వుకుంటున్నారన్నమాట! వాళ్ళకది సరదా ఆటగా ఉంది! నేనూ లోలోపలే నవ్వుకుంటూ అక్కడి నుండి వచ్చేశాను.

కాసేపటికి సుందరి మళ్లీ వచ్చి... నవ్వు మొహంతో కాగితం నా చేతిలో పెట్టి రహస్యంగా మాట్లాడింది. ''కనకమ్మగారి బాల లేదూ... అది సామాన్ల గది దగ్గరే కాపువేసి లోపలకు తొంగి తొంగి చూస్తూ శకుంతలక్క ఓ డబ్బా క్రింద ఆ కాగితాన్ని దాచి పెట్టడం చూసింది. ఏమీ తెలియనట్లుగా పక్కకు వెళ్ళిపోయి... శకుంతల అక్క బయటకు వచ్చేయటం చూసి, ఆ కాగితాన్ని చేజిక్కించుకుని వచ్చింది. మేం అందరం చదివేశాం. అబ్బ... నవ్వలేక చచ్చాం అనుకో... నువ్వూ చదువు...!''

నాకు కోపం వచ్చింది. ''తప్పు కదే... ఆ బాలకు నాలుగు చీవాట్లు పెట్టాల్సింది పోయి, మీరందరూ చదవటమే కాకుండా నన్నూ చదవమంటున్నారా...'' అన్నా.

''సరేలే. అలాంటి చాదస్తంతో నేనూ అదే మాట అన్నా... కానీ అది వినకుండా నలుగురి పిల్లల మధ్యలో నిలబడి గొంతు తగ్గించి పైకే చదివేసింది.. దాంతో అందరూ పకపక నవ్వులు...!'' అంది సుందరి.

''నవ్వులు ఎందుకే...?'' ఆశ్చర్యంగా అడిగాను.

''చదివాక నువ్వు నవ్వకపోతే ... అపుడు నేను ఆశ్చర్యపోతా...!'' అంది నవ్వు మొహంతో.

ఆ కాగితాన్ని నా చేతుల్లోనే ఉంచి అక్కడి నుండి వెళ్ళిపోయింది.

నాకేం చేయాలో అర్థం కాలేదు. చదవటానికీ మనస్కరించలేదు.

ఆ కాగితాన్ని పట్టుకుని పక్కనే ఉండే పెదనాన్నా వాళ్ళింటికి వెళ్ళా.

శకుంతల అక్క ఏదో కూనిరాగం తీస్తూ, అద్దంలో చూసుకుంటూ జడ వేసుకుంటోంది.

''ఏంటక్కా ఇది... బావ ఉత్తరం రాస్తే... అది ఎవరి చేతికీ దొరక్కుండా నీ పెట్టెలో పెట్టుకోక, అందరూ తిరిగే సామాన్ల గదిలో పెట్టావా...? అది తీసి బాల అందరికీ చూపించింది తెలుసా..?'' అన్నాను.

''అవును.. తెలుసు... చదివి బాగా నవ్వుకుంటున్నారు కూడా. అవునా...?'' తాపీగా అడిగింది.

''నీకూ... తెలుసా? వాళ్ళని ఏం అనలేదా..?'' నివ్వెరపోయాను.

''ఏదో వాళ్ళ సరదా వాళ్ళదిలే అని నవ్వుకున్నాను. ముందు నాకర్థం కాలేదు. వాళ్ళు నన్ను చూసి నోటికి అరచేయి అడ్డం పెట్టుకుని.. ఎందుకు నవ్వుకుంటున్నారా అనుకున్నా. కానీ తర్వాత వాళ్ళు వడియాలు... అప్పడాల కర్ర ... అంటూ నవ్వుతుంటే అప్పుడు నాకు తెలిసింది. నేను దాచిన ఉత్తరాన్ని వాళ్ళు చదివి

ఉంటారని...''

''అదేమిటే..మీ ఆయన నీకు రాసిన ఉత్తరంలో ... వడియాలు, అప్పడాల గురించి రాశాడా? విచిత్రంగా ఉందే...?'' అన్నా.

''ఆ కాగితం నీ చేతిలోనే ఉంది కదే... చదవరాదూ... నీకూ అర్థమవుతుందిగా...!'' అంది అక్క చిరునవ్వుతో..

''వద్దులే అక్కా.. బావ నీకు రాసిన ఉత్తరాన్ని నేను చదవటమేమిటి... ఇపుడయినా ఈ పిల్లరాక్షసులకి దొరక్కుండా దాచుకో...'' అంటూ ఆ కాగితాన్ని అక్క చేతిలో పెట్టాను.

అక్క నవ్వుతూ ''అబ్బ ..చదవవే అని నేనే చెబుతున్నాగా...'' అంటూ మళ్లీ నా చేతికి ఇచ్చింది.

సరే... అందరూ చదివారుగా... అంత నవ్వొచ్చే విషయం ఏముందీ అనుకుంటూ ఆ కాగితం మడత విప్పాను.

ఒసేయ్ పిచ్చిమొహమా...

చెల్లెలి పెళ్ళికి పిలుపు రాగానే 'సిరికిం జెప్పడు...' స్టయిల్లో పరిగెట్టుకు వెళ్ళిపోవటమేనా...? పెళ్ళిలో అరువు నగలు పెట్టుకుని మా పరువు తీయాలని పంతం పట్టావా? లేకపోతే.. నువ్వంత ఆగమేఘాల మీద వెళ్లకపోతే ఆగిపోయే పనులేమున్నాయనీ...?

ఇందాకనే బీరువా తీసి చూసిన అమ్మ నువ్వు పెళ్ళికి నీ పట్టుచీరలు, నగలు ఏవీ తీసుకెళ్ళకుండానే వెళ్ళావని చెప్పింది. అవన్నీ వెంటబెట్టుకుని వాజమ్మలా నేను పరుగుపెట్టి రావాలనేగా ఇలా చేశావు? అవునా...?

అనుమతి కోసం కాకపోయినా ఓ మాట నా చెవిని వేసి వెళ్దామనే ఇంగితజ్ఞానం లేకుండా ఆఫీసు నుండి నేను వచ్చే వరకూ అయినా ఆగకుండా కబురు తెచ్చిన పెద్దమనిషితోనే వెళ్ళిపోవటంలో నీ ఉద్దేశం ఏమిటి?

ఎగిరిపోయినట్లుగా ఆదరా బాదరాగా అన్నీ వదిలేసి వెళ్ళిపోతే... ఈ వెధవాయ్ నీ శంఖ చక్రాల్ని (అవేలే... నగలు, పట్టుచీరల్ని) తీసుకుని నేను రావాలన్నమాట! అందుకోసం ఈ రోజు మా ఆఫీసరు గారి కాళ్ళు పట్టుకుని సెలవు శాంక్షను చేయించుకోవాల్సి వచ్చింది! పెళ్ళికి ఆఫీసు పని ఒత్తిడి వల్ల రాలేనని అన్నానని ఇలా ప్లాను వేశావ్ కదూ?

నా సంగతి సరే, అత్తగారంటే కూడా నీకు ఉత్తుత్తి గౌరవమేకానీ వీసమెత్తు భయం అయినా లేదన్నమాట! ఎండలో ఆరబెట్టిన వడియాలు అలాగే ఉండిపోయాయి. లోపలికి తేనే లేదు. ఆవకాయ తీసిన జాడీకి మళ్లీ వాసిన కట్టనేలేదు... అలమరాలో ఎవరు పెట్టాలట...? అప్పడాలకర్ర అంతు చిక్కకుండా ఎక్కడ దాచిపెట్టావో, ఎంత వెతికినా అమ్మకి కనిపించనేలేదట! సరేలే... ఇలా చెప్పుకుంటూ పోతే... నీ తెలివితక్కువ పనుల జాబితా పెద్దదే అవుతుంది. అందుకని ఇక్కడతో ఆ చిట్టాకి చుక్క పెట్టేస్తున్నా... వచ్చాక

నీ పని పడతా.

పెళ్ళి కాగానే నాతోపాటు తిరిగి వచ్చెయ్యడానికి సిద్ధంగా ఉండు. నువ్వు తీరిగ్గా తర్వాత వస్తానంటే... నేను వల్లకోను పిల్లా!

పెళ్ళికి మా అమ్మ వస్తుందో రాదో తెలియదు. మర్యాదలంటూ, మీ వాళ్ళతో మాకు బట్టలు పెట్టే ప్రోగ్రాం పెట్టించకు. అవి మాకెలాగూ నచ్చవు. వంకలు పెడుతున్నామనే పేరు నుండి తప్పించుకునే వీలుంటుంది, కాబట్టి నువ్వే ఏదో చెప్పి ఆ పని మాన్పించు... నీకు పుణ్యం ఉంటుంది !

ఇట్లు

నీ పుణ్యంకొద్దీ దొరికిన నీ పురుషుడు

దుష్యంత మహారాజు సమానుడు మాధవరావు

ఆ ఉత్తరం చదటం ముగించగానే అప్రయత్నంగా నా పెదవులపైకి నవ్వు వచ్చింది అందుకే కాబోలు, చదివాక నవ్వకుండా ఉంటే ఆశ్చర్యపోతానని సుందరి చెప్పింది.

పిల్లలు వడియాలు, అప్పడాలు అంటూ.. ఎందుకు ఆట పట్టిస్తూ నవ్వుతున్నారో కూడా అర్థమైంది!

''సామాన్ల గదిలో కూర్చుని నువ్వు ఈ ఉత్తరం చదువుకుంటున్నపుడు ఈ పిల్లల గుంపు నన్ను పిలుచుకు వచ్చి ఆ సీను చూపించారు. నీ హావభావాలూ, ఎవర్నీ గమనించని మైమరపు, అంతసేపు ఏకదీక్షగా మళ్ళీ మళ్ళీ కాబోలు చదువుకోవటం చూసి ఎంత మధురమైన ప్రేమలేఖో అయివుంటుందని అనుకున్నా! కానీ ఇదేమిటే.. బావ తిట్ల పురాణంలా ఇలా రాశాడూ... దీన్నేనా నువ్వు అంత భద్రంగా దాచిపెట్టుకున్నావు...?'' అనడిగాను నవ్వుతూనే.

అక్క కూడా నవ్వుతూనే ''ఇలాంటి ఉత్తరాన్ని చింపెయ్యాలంటావా..?'' అంటూ నా దగ్గర్నుండి తీసుకున్న ఆ కాగితాన్ని చించి ముక్కలు చేసి పడేసింది !

''అదేంటక్కా అలా చేశావ్...? నేనేదో మామూలుగా అన్నానంతే. బావ రాసిన ఉత్తరాన్ని దాచుకోవాల్సిందే... నవ్వొచ్చేట్లుగా హాస్యంగా రాసాడు! నీకు కోపం వచ్చిందా.. అలా చేశావ్ ? "

''కోపమా...?'' అంటూ అక్క ఫక్కున నవ్వింది. "అది ఉత్తుత్తి ఉత్తరమేలే.. అసలుది వేరే ఉంది తెలుసా?''

"ఉత్తరాల్లో ఇలాంటి రకాలు.. ఉత్తుత్తివి... నిజానివీ అంటూ ఉంటాయా..? విచిత్రంగా ఉందే..!'' ఆశ్చర్యపోతూ అన్నాను.

''ఇదిగో నేను దాచిపెట్టుకున్న అసలు ఉత్తరాన్ని నీకిపుడు చూపిస్తాను...'' అంటూ గది తలుపుకి లోపల గడియపెట్టి వచ్చి తన ట్రంకుపెట్టి తీసి బట్టల అడుగున దాచిన కాగితాన్ని నా చేతికి ఇస్తూ " ఇది చదివితే... అసలు విషయం నీకే తెలుస్తుంది" అంది.

నేను మోహమాటంగా ''ఏమిటో నువ్వే చెప్పు. నేను చదవటం దేనికిలే'' అన్నాను. ''ఏం పర్వాలేదు.

ఇంకో అయిదారు రోజుల్లో పెళ్ళిపీటలెక్కబోతున్నావుగా... నీకూ ఉమ్మడి కుటుంబంలోని అచ్చట్లూ ముచ్చట్లూ ఎలా ఉంటాయో కొంచెం ముందుగా తెలుస్తుంది అంతేగా...'' అంది.

''మాది ఉమ్మడి కుటుంబం క్రింద రాదులే. అత్తగారు ఒక్కరే ఉంటారు!'' అన్నా.

''అత్తగారి అధికారమే భార్యభర్తలమధ్య పర్వతమంత అడ్డంగా ఉంటుంది. అనుభవం మీద చెబుతున్నా... విను... మా మరుదులు ఇద్దరూ, ఆడబడుచూ ఉదయమే స్కూళ్ళకు వెళ్ళిపోతారా... ఈయనగారు ఆఫీసుకు ఆ తర్వాత ఒక గంటకిగానీ బయలుదేరరులే... ఆ కాసేపటిలో పక్కన అత్తగారున్నా .. ఎన్ని అల్లరి చిల్లరి వేషాలో...!'' అంటూ పకపక నవ్వి, ''వెనకనే వచ్చి చెంగులాగటం, లేకపోతే చేయి గిల్లటం.. ఆ అల్లరికి నేనేమో గట్టిగా అరవలేక, కోపంగా చూసి రుసరుసలాడటం...!'' అంది.

ఆ మాటలు చెబుతున్నపుడు అక్క మొహం చూస్తుంటే... 'రాగరంజితం' అనే మాట మళ్ళీ గుర్తుకు వచ్చింది.

అక్క ఇంకోసారి ''చదవవే...'' అనేసరికి సంకోచాన్ని పక్కకుపెట్టి ఆ కాగితంలోని అక్షరాల వెంట చూపుల్ని పరుగుపెట్టించా.

★ ★ ★